**International Journal of Academic Research** P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-1, Jan-Mar-2025
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# పోతన 'వీరభద్ర విజయము' - సమీక్ష

**దేవరపల్లి రామయ్య**

ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం మన్యం జిల్లా

**వ్యాస సంగ్రహం:**

బమ్మెర పోతన రచించిన వీరభద్ర విజయములో ప్రధానంగా దక్షయజ్ఞం, దాని వినాశనం, వీరభద్రుడి ఆవిర్భావానికి సంబంధించిన పౌరాణిక విశేషాలు ఉన్నాయి. ఈ గ్రంథం పోతన యొక్క తొలి రచనలలో ఒకటిగా పరిగణించబడుతోంది. ఈ గ్రంథం పోతన గారు తన ప్రసిద్ధ రచన అయిన 'శ్రీమద్భాగవతం' అనువాదానికంటే ముందే రచించినట్లు తెలుస్తోంది. బహుశా ఇది 'భోగినీ దండకం' కంటే కూడా ముందు రాసిన కావ్యం కావచ్చని పండితుల అభిప్రాయం. దీనికి మఠలం వాయు, శివ పురాణాలు. ఈ కావ్యంలోని పద్యాలు సంస్కృత స్తోత్రాలతో సమానమైన కీర్తిని కలిగి ఉన్నాయి. భాగవతంలోని రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం వంటి ఘట్టాలను ఎంత భక్తితో పారాయణం చేస్తారో, అదే రీతిలో వీరభద్ర విజయంలోని స్తోత్రాలను కూడా చదివి ఆనందిస్తారు. సామాన్యంగా దాక్షాయణి దేహత్యాగం, శివుడు దక్షుడిని శిక్షించడం వంటి కథలు అందరికీ తెలుసు. అయితే, దక్షయజ్ఞం రెండు సార్లు జరగడం, రెండు సార్లు భగ్నం కావడం వంటి విశేషాలను పోతన ఈ గ్రంథంలో వివరించారు. పోతన సహజ పండితుడు కావడంతో ఆయన కవితా మాధుర్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులోని పద్యాలు ఆబాలగోపాలం కంఠస్థం చేయదగినవిగా, చదివి ఆనందించదగినవిగా ఉంటాయి. పోతన తన ఈ కావ్యాన్ని పరమేశ్వరుడికే అంకితమిచ్చాడు. గ్రంథం అంతటా శివ భక్తి, వీరభద్రుని పరాక్రమం అద్భుతంగా వర్ణించబడ్డాయి. ఈ కావ్యం నాలుగు ఆశ్వాసాలుగా విభజించబడింది. ఇందులో సతీదేవి దేహత్యాగం, పార్వతీదేవి జననం, మన్మథ దహనం, గిరిజా కల్యాణం, వీరభద్రుని విజయం వంటి ఘట్టాలు అద్భుతమైన పద్యాలతో వర్ణించబడ్డాయి. శివ భక్తితో నిండిన ఈ కావ్యం పోతన కవితా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన ఘట్టం, తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన గ్రంథం. ఇలాంటి గ్రంథాన్ని సమీక్ష చేయడమే ఈ వ్యాస ఉద్దేశం.

**కీలకపదాలు:**

నైమిశారణ్యం, దక్ష ప్రజాపతి, మురమళ్ల క్షేత్రం, దక్షయజం, యజ్ఞగుండం, భద్రకాళి, వైవస్వత మన్వంతరం, దేహత్యాగం, చాక్షుష మన్వంతరం మొదలైనవి.

**కవి పరిచయం:**

15వ శతాబ్దానికి చెందిన బమ్మెర పోతన తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందిన భక్తి కవి. ఆయన సంస్కృతంలోని భాగవత పురాణాన్ని మధురమైన తెలుగులోకి 'శ్రీమదాంధ్ర భాగవతం' పేరిట అనువదించారు. అపారమైన

పాండిత్యం ఉన్నప్పటికీ, రాజులకు తన కవితను అంకితం చేయకుండా భగవంతునికే అంకితం చేసిన ఆత్మగౌరవ కవి. ప్రస్తుత జనగామ జిల్లాలోని బమ్మెర గ్రామంలో జన్మించారు. ఆయనది శైవ కుటుంబం. లక్కమాంబ, కేసన (కేసయ) వీరి తల్లిదండ్రులు. ఈయన బిరుదు 'సహజ పండితుడు' (గురువు లేకుండానే కవితలు చెప్పగల సహజకవి). వీరి ప్రధాన రచనలు, ఆంధ్ర మహా భాగవతం, భోగినీ దండకం (ఇది తెలుగులో లభించిన తొలి దండకం)వీరభద్ర విజయం, నారాయణ శతకం మొదలైనవి. వీరి రచనా శైలి చాలా ప్రత్యేకమైంది. పోతన కవిత్వం శబ్దాలంకారాల సొగసుతో, భక్తి రస ప్రధానంగా ఉంటుంది. పండితులకు, పామరులకు కూడా సులభంగా అర్థమయ్యే మధురమైన శైలి ఆయన సొంతం. “పాలకడలిలో విషం పుట్టినా అమృతం కోసం పట్టుబట్టినట్లు... కష్టాలు వచ్చినా భగవద్భక్తిని వీడలేదు” అనే నినాదానికి ఆయన జీవితం ప్రతీక. భాగవతాన్ని ఓరుగల్లు ప్రభువు సింగ భూపాలునికి అంకితం చేయమని కోరినా నిరాకరించి, శ్రీరామునికి అంకితం చేశారు.

**వీరభద్ర విజయము -కథా సారాంశం:**

ఇది నాలుగు ఆశ్వాసాల కావ్యం. ప్రథమాశ్వాసంలో నైమిశారణ్యంలో మునులంతా పన్నెండేళ్ళ పాటు ఒక యాగం చేస్తారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన వాయుదేవుడు వారికి శివ కథలను వినిపిస్తాడు. పూర్వం శివుడు, పార్వతి కైలాసంలో కొలువు తీరినప్పుడు దక్షప్రజాపతి అక్కడికి వస్తాడు. శివుడు తనను తగిన రీతిన గౌరవించలేదని భావించి, శివుడిని తీవ్రంగా దూషిస్తాడు. తన భర్తను దూషించడం సహించలేక, దక్షుని కుమార్తె అయిన సతీదేవి యోగాగ్నిలో తన తనువును చాలిస్తుంది. ఆగ్రహించిన శివుడు, దక్షుడిని వచ్చే జన్మలో తన చేతిలో అంతమవుతావని శపిస్తాడు. సతీదేవి హిమవంతుని కుమార్తెగా జన్మిస్తుంది. ఆమె శివుడిని భర్తగా పొందాలని కోరుకుంటుంది. ద్వితీయాశ్వాసంలో తారకాసురుని సంహరించడానికి శివపార్వతుల కుమారుడే సమర్థుడని బ్రహ్మ చెబుతాడు. శివునిలో పార్వతి పట్ల అనురాగం కలిగించడానికి దేవతలు మన్మథుడిని పంపుతారు. శివుడు తన తపోభంగానికి కారణమైన మన్మథుడిని మూడవ కంటితో భస్మం చేస్తాడు. మన్మథుని మరణంతో దుఃఖించిన రతీదేవిని ఆకాశవాణి ఓదారుస్తుంది. పార్వతి శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఘోర తపస్సు చేస్తుంది. శివుడు బ్రహ్మచారి వేషంలో వచ్చి ఆమెను పరీక్షించి, చివరకు తన నిజరూపంతో ప్రత్యక్షమై ఆమెను అనుగ్రహిస్తాడు.  తృతీయాశ్వాసంలో, శివుడు సప్తర్షులను, అరుంధతిని హిమవంతుని వద్దకు వివాహ రాయబారానికి పంపుతాడు. దేవతలందరి సమక్షంలో శివపార్వతుల వివాహం వైభవంగా జరుగుతుంది. పాలసముద్రాన్ని మథించినప్పుడు పుట్టిన హాలాహలాన్ని లోక రక్షణ కోసం శివుడు తన కంఠంలో దాచుకున్నాడని, అందుకే ఆయన కంఠం నల్లగా మారిందని పార్వతికి వివరిస్తాడు. చతుర్థాశ్వాసంలో శాపం ప్రకారం దక్షుడు వైవస్వత మన్వంతరంలో తిరిగి జన్మిస్తాడు. శివుడిని అవమానించాలనే ఉద్దేశంతో ఆయనను పిలవకుండా ఒక పెద్ద యాగాన్ని తలపెడతాడు. దక్షుడు చేస్తున్న శివనిందను తెలుసుకున్న శివుడు తన క్రోధం నుండి వీరభద్రుడిని, పార్వతి తన శక్తితో భద్రకాళిని సృష్టిస్తారు. వీరభద్రుడు తన ప్రమథ గణాలతో వెళ్లి దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేస్తాడు. యాగంలో పాల్గొన్న దేవతలను శిక్షిస్తాడు. చివరకు దక్షుని శిరస్సు ఖండించి యజ్ఞగుండంలో వేస్తాడు. బ్రహ్మ తదితర దేవతల ప్రార్థన మేరకు శివుడు శాంతించి, దక్షుడికి మేక తల తగిలించి పునర్జీవితుడిని చేస్తాడు. దక్షుడు తన తప్పు తెలుసుకుని శివుడిని స్తుతిస్తాడు. అనంతరం వీరభద్రుడికి పట్టాభిషేకం జరుగుతుంది.

**వీరభద్రుడు మరియు భద్రకాళి ఆవిర్భావం:**

ఈ కావ్యంలో చెప్పుకోవలసిన మొదటి అంశం వీరభద్రుడు, భద్రకాళిల ఉద్భవం. వీరి ఆవిర్భావం ఒక విశేషంగా పేర్కొన్నాడు పోతన. వీరభద్రుడు దక్షుడు శివుడిని పిలవకుండా యాగం తలపెట్టి, శివ నిందకు పాల్పడినప్పుడు పరమశివుడు ఆగ్రహంతో పెద్ద హుంకారం చేస్తాడు. ఆ హుంకారం నుండి అతి రౌద్రరూపంతో, వెయ్యి చేతులతో, అగ్ని నేత్రాలతో వీరభద్రుడు ఉద్భవిస్తాడు.

"అలుగువాడు నిప్పు లొలుకు జూపులవాడు
మంటలెగయు నొసలికంటివాడు
బలిమి బట్టి యెట్టి బ్రహ్మాండముల నైన
ద్రుంపువాడు రిపుల జంపువాడు"(వీరభద్ర విజయం, చతుర్థాశ్వాసము, 54వ పద్యం)

ఇతడు రుద్రుని అంశతో రెండవ దక్ష యజ్ఞాన్ని భగ్నం చేయడానికి సృష్టించబడ్డాడు. ఇక భద్రకాళి ఆవిర్భావం గురించి చూస్తే, శివుడు వీరభద్రుడిని సృష్టించిన సమయంలోనే, అమ్మవారు పార్వతీదేవి తన కోపం నుండి భయంకరమైన ఆకారం కలిగిన భద్రకాళిని సృష్టించింది. దీనినే ఈ కావ్యంలో 'భద్రేశ్వరి' అని కూడా పేర్కొన్నాడు పోతన.

ఈ పాత్రల ప్రాముఖ్యత ఈ కావ్యంలో చాలా ఉంది. వీరిద్దరూ ముఖ్యంగా దక్షుని అహంకారాన్ని అణచివేసి, అతడు చేస్తున్న యజ్ఞాన్ని ధ్వంసం చేయడానికి రుద్ర సంకల్పంతో ఆవిర్భవిస్తారు. యజ్ఞవాటికను రణరంగంగా మార్చి, శివ ద్రోహానికి పాల్పడిన దక్షుడిని మరియు అతడికి సహకరించిన దేవతలను శిక్షించడం వీరి ప్రధాన బాధ్యతగా కనిపిస్తుంది. దక్ష యజ్ఞ ధ్వంసం అనంతరం, పార్వతీదేవి అనుజ్ఞతో వీరికి వివాహం జరుగుతుంది. వీరు భార్యాభర్తలుగా ఉండి శాశ్వత లోక కల్యాణ కారకులుగా నిలుస్తారని శివపార్వతులు వీరిని ఆశీర్వదించడం ఇందులో ప్రధాన అంశం. నేడు తెలుగు ప్రాంతాల్లో వీరభద్రుడు, భద్రకాళి భక్తుల పాలిటి వరదాతలుగా ప్రసిద్ధి చెందారు. మురమళ్ల, పట్టిసీమ, కురవి, దీబగుంట్ల వంటి అనేక పుణ్యక్షేత్రాలలో వీరిని పూజిస్తారు. ముఖ్యంగా మురమళ్ల క్షేత్రంలో ప్రతిరోజూ వీరికి నిత్య కల్యాణం నిర్వహించడం విశేషం. ఇంకా చెప్పాలంటే, అహంకారాన్ని నశింపజేసి ధర్మాన్ని కాపాడటమే వీరి పాత్రలోని ముఖ్య ఉద్దేశ్యంగా పోతనామాత్యుడు చిత్రించాడు.

**మొదటి దక్ష యజ్ఞం(చాక్షుష మన్వంతరం):**

బమ్మెర పోతన రచించిన 'వీరభద్ర విజయము' కావ్యం ప్రకారం దక్ష యజ్ఞం రెండు సార్లు జరగడం, రెండు సార్లు భగ్నం కావడం ఒక విశేషం. పూర్వం శివుడు కొలువు తీరినప్పుడు దక్షుడు అక్కడికి వస్తాడు. శివుడు అందరిలాగే తనను గౌరవించాడని, తనకు ప్రత్యేక సత్కారాలు చేయలేదని దక్షుడు అహంకారంతో శివునిపై కోపం పెంచుకుంటాడు. శివుడిని అవమానించాలనే ఉద్దేశంతో దక్షుడు ఒక గొప్ప యజ్ఞాన్ని తలపెట్టి, శివుడిని తప్ప అందరినీ పిలుస్తాడు. ఈ సందర్భంలో సతీదేవి దేహత్యాగం గురించి చెప్పుకోవాలి. శివుని అనుమతితో యజ్ఞానికి వెళ్ళిన సతీదేవిని దక్షుడు తీవ్రంగా దూషిస్తాడు. శివనిందను సహించలేక సతీదేవి యోగాగ్నిలో తన తనువును చాలిస్తుంది. దీంతో ఆగ్రహించిన శివుడు, దక్షుడిని వచ్చే జన్మలో తన చేతిలో అంతమవుతావని శపిస్తాడు.

**రెండవ దక్ష యజ్ఞం (వైవస్వత మన్వంతరం):**

శాపం ప్రకారం దక్షుడు తిరిగి జన్మించి, హిమాలయాల వద్ద ఆకాశగంగ ప్రవహించే చోట అశ్వమేధ యజ్ఞాన్ని ప్రారంభిస్తాడు. ఈసారి కూడా శివుడిని పిలవకుండా యజ్ఞం చేస్తుండగా, దధీచి మహర్షి వచ్చి శివుడు లేని యజ్ఞం

యజ్ఞమేనా అని ప్రశ్నిస్తాడు. దక్షుడు శివుడిని తిరిగి నీచంగా దూషిస్తాడు. దక్షుని అహంకారాన్ని అణచడానికి శివుడు తన కోపం నుండి వీరభద్రుడిని, పార్వతీదేవి తన కోపం నుండి భద్రకాళిని సృష్టిస్తారు. తరవాత శివుని ఆజ్ఞతో వీరభద్రుడు తన ప్రమథ గణాలతో వెళ్లి యజ్ఞ వాటికను ధ్వంసం చేస్తాడు. యజ్ఞానికి సహకరించిన ఇంద్రాది దేవతలను, సూర్యచంద్రాదులను వీరభద్రుడు కఠినంగా శిక్షిస్తాడు. ఆ తరువాత విష్ణువుతో యుద్ధం చేస్తాడు. లోక రక్షణార్థం విష్ణువు అడ్డుపడగా, వీరభద్రుడికి శివుడు బ్రహ్మ ద్వారా ఒక ప్రత్యేక రథాన్ని పంపుతాడు. వారిద్దరి మధ్య భయంకరమైన యుద్ధం జరిగి, చివరకు వీరభద్రుడు విష్ణువు యొక్క చక్రాన్ని కూడా ముక్కలు చేస్తాడు. మొత్తానికి వీరభద్రుడు దక్షుని శిరస్సు ఖండించి యజ్ఞగుండంలో వేస్తాడు. అనంతరం బ్రహ్మాది దేవతల ప్రార్థనపై శివుడు శాంతించి, దక్షుడికి మేక తల తగిలించి పునర్జీవితుడిని చేస్తాడు. దక్షుడు తన తప్పు తెలుసుకుని శివుడిని స్తుతిస్తాడు. ఇలా ఈ కావ్యంలో దక్ష యజ్ఞం అహంకారానికి మరియు దైవనిందకు లభించే శిక్షకు నిదర్శనంగా వర్ణించబడింది.

**దక్షయజ్ఞం - విశేషాలు:**

బమ్మెర పోతన రచించిన వీరభద్ర విజయంలో దక్షయజ్ఞం రెండు సార్లు జరగడం, రెండు సార్లు భగ్నం కావడం ఒక విశిష్టమైన అంశం. ఇవి వేర్వేరు కాలాలకు సంబంధించిన విశేషాలు. మొదటి యజ్ఞం చాక్షుష మన్వంతరంలో జరగగా, రెండవ యజ్ఞం వైవస్వత మన్వంతరంలో జరిగింది. మొదటి జన్మలో దక్షుడు బ్రహ్మ కాలి బొటనవేలు నుండి పుట్టగా, రెండవ సారి ప్రచేతసుని కుమారుడిగా జన్మించాడు. ఇదొక విశేషం. అలాగే మొదటి యజ్ఞ సమయంలో శివుడిని అవమానించినందుకు, సతీదేవి దేహత్యాగానికి కారణమైనందుకు ఆగ్రహించిన శివుడు దక్షుడిని శపిస్తాడు. "నీవు మళ్ళీ దక్షుడనే పేరుతో పుడతావు, మళ్ళీ యజ్ఞం చేస్తావు, నా కారణం చేతనే నీ యజ్ఞం రెండవ సారి కూడా భగ్నమవుతుంది" అని శివుడు శాపం ఇస్తాడు. వాయు పురాణం మరియు శివ పురాణాల్లో ఈ శాప వృత్తాంతం కనిపిస్తుంది. మొదటిసారి అమ్మవారు సతీదేవిగా పుట్టి, తండ్రి చేసిన అవమానం భరించలేక యోగాగ్నిలో తన తనువును చాలిస్తుంది. రెండవ సారి దక్షుడిని శిక్షించడానికి శివుడు తన అంశతో వీరభద్రుడిని, పార్వతీదేవి తన క్రోధం నుండి భద్రకాళిని సృష్టించారు. వీరభద్రుడు దక్షుని సంహరించి యజ్ఞాన్ని ధ్వంసం చేస్తాడు. పోతన గారు ఈ రెండు యజ్ఞాల వృత్తాంతాన్ని వివరించడంలో ప్రధానంగా వాయు పురాణాన్ని, కొన్ని చోట్ల శివ పురాణాన్ని అనుసరించారు. సాధారణంగా లోకంలో దక్షయజ్ఞం అనగానే ఒకే కథగా తెలుసు, కానీ అది రెండు వేర్వేరు మన్వంతరాల్లో జరిగిందని, రెండు సార్లు భగ్నమైందని తెలపడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత.

**మురమళ్ల క్షేత్ర విశేషాలు:**

గిరిజాధీశ్వరు నానతి  
బరగగ జేపట్టి భువనభరదక్షుండై  
కరుణన్  జగంబులన్నియున్  
బరిపాలన జేయు వీరభద్రుం డెలమిన"

(వీరభద్ర విజయం, చతుర్థాశ్వాసము, 223వ పద్యం)

ముందుగా క్షేత్ర ఉనికి గురించి చర్చించుకుంటే, మురమళ్ల అనే గ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ ప్రాంతంలో ఉంది. ఇక్కడ భద్రకాళి సమేత వీరభద్రేశ్వరుని అత్యంత ప్రాచీనమైన మరియు విశిష్టమైన ఆలయం ఉంది.

మురమళ్ల క్షేత్రం యొక్క అత్యంత ప్రధాన విశిష్టత ఇక్కడ నిర్వహించే నిత్య కల్యాణం. ఈ ఆలయంలో ప్రతిరోజు రాత్రి భద్రకాళి, వీరభద్రులకు వైభవంగా వివాహ వేడుక జరుగుతుంది. తెలుగు ప్రాంతాల్లోని వీరభద్ర ఆలయాలలో ఇదొక అరుదైన విశిష్టమైన సంప్రదాయం అని చెప్పొచ్చు. పురాణ నేపథ్యం గురించి ప్రస్తావిస్తే, దక్షయజ్ఞ ధ్వంసం జరిగిన తర్వాత పార్వతీదేవి అనుమతితో వీరభద్రుడు, భద్రకాళికి వివాహం జరిగిందని తెలుస్తుంది. వీరు భార్యాభర్తలుగా ఉండి శాశ్వత లోక కల్యాణ కారకులుగా నిలుస్తారని శివపార్వతులు వీరిని ఆశీర్వదించారని ప్రతీతి. ఈ వివాహ వృత్తాంతానికి ప్రతీకగా మురమళ్లలో నిత్య కల్యాణం నిర్వహిస్తారు.అలాగే  వరదాతగా వీరభద్రుడు ప్రసిద్ధి. మురమళ్లలో వెలసిన వీరభద్రస్వామి భక్తుల పాలిటి వరదాతగా ప్రసిద్ధి చెందారు. కేవలం మురమళ్లలోనే కాకుండా పట్టిసీమ, కురవి, బీబగుంట్ల వంటి క్షేత్రాలలో కూడా వీరభద్రుడు భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా పూజలందుకుంటున్నాడు. క్లుప్తంగా చెప్పాలంటే, మురమళ్ల క్షేత్రం భద్రకాళి వీరభద్రుల దివ్య కల్యాణ శోభతో విలసిల్లుతూ, భక్తులకు లోక కల్యాణాన్ని ప్రసాదించే పవిత్ర స్థలంగా ఈ గ్రంథం ద్వారా మనకు తెలుస్తోంది.

**ముగింపు:**

బమ్మెర పోతన రచించిన 'వీరభద్ర విజయం' వీరశైవ సంప్రదాయాన్ని, భక్తిని చాటిచెప్పే అద్భుతమైన ప్రబంధంగా అర్థం చేసుకోవచ్చు. దక్ష యజ్ఞం, వీరభద్రుని జననం, యాగ విధ్వంసం, తదనంతర పరిణామాలతో కూడిన ఈ కావ్యం పురాణ సంబంధ అంశాలను కూలంకుషంగా చర్చించింది. వీరభద్రుని ప్రతాపం ముందు నిలువలేక, యాగశాల సర్వనాశనం కావడంతో దక్ష ప్రజాపతికి తన తప్పు తెలుస్తుంది. దక్షుడు తన అహంకారాన్ని వీడి, శివుడే సర్వేశ్వరుడని గ్రహించి మనస్ఫూర్తిగా క్షమాపణలు వేడుకుంటాడు. శివభక్తుడైన వీరభద్రుడు దక్షుని ప్రార్థనకు కరిగి, మరణించిన దక్షునికి మేక తలను తగిలించి ప్రాణభిక్ష పెడతాడు. విధ్వంసమైన యాగం వీరభద్రుని సమక్షంలోనే దిగ్విజయంగా పూర్తవుతుంది. దేవతలందరూ శివ-వీరభద్రులను స్తుతిస్తారు. చివరగా, లోకంలో శైవ-వైష్ణవ భేదాలు తొలగిపోయి, శివ భక్తి పరిమళిస్తుంది. శివుని ఆదేశాల మేరకు దేవతలు తిరిగి తమ స్థానాలకు చేరుకోవడం ఇందులో ప్రధానంగా కనిపించింది. మొత్తానికి వీరభద్రుని విజయం ఈ కావ్యంలో చెప్పబడినా, అందలి కథ పురాణాంతర్గతమై పలు విశేషాలను చర్చించిందనే చెప్పాలి.

**ఆధార గ్రంథాలు:**

1.పోతన, బమ్మెర : శ్రీ మహాభాగవతం, మొదటి సంపుటి, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమి, హైదరాబాదు,1983.

2.సత్యనారాయణ, కాశీభొట్ల : వీరభద్ర విజయం(వ్యాఖ్యాన సహితం), శ్రీ రాఘవేంద్ర పబ్లికేషన్స్, విజయవాడ,2016.

3. స్తుబ్రహ్మణ్యం, అనుముల : బమ్మెర పోతన, ప్ర.ము.,విజయలక్ష్మి ప్రింటింగ్ ప్రెస్, జనగామ, తెలంగాణ, 1957.

**Citation:** దేవరపల్లి రామయ్య. A. 2025. "పోతన 'వీరభద్ర విజయము' – సమీక్ష". International Journal of Academic Research, 12(1): 90-94.
**Copyright:** ©2025 దేవరపల్లి రామయ్య. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.